

కథ 1999

8

# మనుషులు వొదులవుతారు

పాపినేని శివశంకర్

చక్రపాణి: “లూస్‌నెస్ ఈజ్ ద ప్రాబ్లమ్”

వదులుతనం. వదులొదులుతనం. వదలని వదులుతనం. ఇదేదో శబ్దాలంకారం లాగుందే? అవును, లాగుంది. పేరే గుర్తురావటం లేదు. రాను రాను జ్ఞాపకం తగ్గి పోటంలా? వయస్సే కారణమేమో?

భయం, భయం. మొన్న బజార్లో వాడు కనపడి ఏమన్నాడు? (ఎంత మారిపొయ్యావ్ చక్రపాణీ!) ఆపర్ణ మొహాన్ని తీసుకొచ్చి అద్దం ముందు పెట్టాను. లేక అద్దాన్ని తీసుకొచ్చి మొహం ముందు పెట్టానా? ఏమో. చెంపల పక్కన, మీసాల చివర్ల తెల్లదనం, తెల్ల వెంట్రుకల దిగులు. ఫార్టీ ఇయర్స్ సిండ్రోమ్. శరీరంలో అక్కడక్కడా కండలు కూడా జారుతున్నట్టున్నాయి. ఇదీ వదులుతనమే. ఇంతకీ వదులుతనం కరెక్టా? లేక వొదులుతనమా? షిట్. ఏదో ‘తనం’, దట్సాల్. లూజ్ నెస్. (లూస్‌నెస్ అనాలి కామాలు, డోంట్ మైండ్.) ఎందుకో చిన్నప్పట్నుంచీ ఏది వదులుగా ఉన్నా భరించ లేనితనం అలవాటైంది. చివరికి పెన్ను కాప్ గూడా టైట్‌గా ఉండాల్సిందే. ఇక ఆడాళ్లలో ఈ లూస్‌నెస్ భరించే దెట్లా? సింప్లీ ఐ హేటిట్. టిట్... టిట్స్ ఆర్ లూజ్. పాలపేకెట్లలాగా అసహ్యం, వజైనా ఈజ్ లూజ్. ఆ... ఆ... గుర్తొచ్చింది. యాద్ ఆయా, అలంకారం. యమా... యమకాలంకారం. హ హా! నా జ్ఞాపకానికేం, బాగానే వుంది. అయామ్ ఓకే. బట్, కానీ భార్యామణి సావిత్రే టోటల్లీ లూజ్. (అరె యార్! ఐ డోంట్ మీన్ కారెక్టర్.) సతీసావిత్రే. సందేహం లేదు. ఒళ్లే, వొదులొదులై పొయ్యింది. ఇంకా ఎన్నాళ్లు దీంతో కాపరం?

అదుగో, మాటల్లోనే వస్తుంది కాఫీకప్పుతో. నడకలో నాజూకుతనం లేదు. కంటికింద చారలు. వొదులు జాకెట్లో వడిలిపోయిన వళ్లు. పదిహేడేళ్ల కిందట దీన్నెట్లా చేసుకున్నానబ్బా? ఆ పొడుగాటి కురుల్ని చూసి చేసుకున్నా కామాల. ఏవీ ఆ కురులు, విరులు, సిరులు? వేర్ ఆర్ ది స్నోస్ ఆఫ్ యస్టర్ ఇయర్? ఏదో జబ్బుతో జుట్టంతా రాలిపోయింది. ఈ జుట్టులేని పతివ్రతతో ఇన్నేళ్లు సంసారం చేశానంటే ఆయామ్ రియల్లీ గ్రేట్. ఆహా? కాఫీ మాత్రం చక్కటి రుచి. చక్కని రుచేమిటి, మై గుడ్‌నెస్, ఏదో ఎడ్వర్టైజ్ మెంట్‌లోలాగా? కాఫీ బాగా పెడుతుంది. వంటలోనూ తిరుగులేదు. వంటలో బాగున్నా వంట్లోనే బాగుండదు. (ఏంటో ఇవాళ భలేచమత్కారాలు వొలికిపోతున్నాయి!) ఈ కాఫీకప్పు తీసెయ్యదేం?

ఎప్పుడు దగ్గరికెళ్లినా అమ్మో, కీళ్ల నొప్పులం టుంది. అయినా వేరే ఆడవాళ్లని వెతుక్కుంటూ వెళ్లానా? అయామ్ గ్రేట్. నిజంగా గ్రేట్‌నెస్సేనా? ఏ పాడు జబ్బులొస్తాయోనని పాడుభయం కూడా వుందిలే. ‘ఉందిలే మంచికాలం ముందు ముందూనా, ఉందిలే మధుబాలా సందు సందూనా?’ ప్రాస సరిపోయింది గానీ సందు సందులో ఎక్కడ? మెయిన్ రోడ్‌లోనేగా? మధూ! ఐ లవ్ యూ.... ఐ వాంట్ యు రాదర్.

ఇంకా ఇట్లాగే కూర్చున్నానేంటి? తొందరగా తయారవ్వాలి. మధుబాలని కలవాలి. కలిసి వుందామనే ప్రపోజల్ ముందు పెట్టాలి. బీ క్విక్. ఈ షర్ట్ ఇంత టైట్‌గా ఏడ్చిందేమిటి? వెధవ పొట్ట, పైకి తన్నుకొస్తుంది. అవునూ, ‘వెధవ పొట్ట’ అంటే ‘వెధవ యొక్క పొట్ట’

అనా? హహ్హా! నాకూ సెన్సాఫ్ హ్యూమరుంది. నిజానికి ఈ నా పొట్టకి థాంక్స్ చెప్పాలి. దీనివల్లనే గదా జాగింగ్ మొదలుపెట్టింది? జాగింగ్‌లోనే గదా మధుబాల- సైకిల్ మీద వెళ్తూ- కుక్క కరిచి కిందపడి- నాకు తటస్థ పడింది! వాటె బ్యూటీ! అదేగదా మా పరిచయానికి మొదలు. కాబట్టి కుక్కకీ థాంక్స్. ముందుగా ఆ యొక్క కుక్కకా? నా యొక్క పొట్టకా? ముందుగా నా యొక్క పొట్టకే థాంక్స్. (ఎక్కడికండీ బయల్దేరుతున్నారూ?) అయిందీ, సరిగ్గా వాసన పట్టేస్తుంది. ఏదో అట్లా బజారు దాకా. (అంతా నా ఖర్మ! వచ్చేటప్పుడు అమ్మాయికి నోట్ బుక్కులంట, తీసుకురాండి.) ముసల్దానా! నీ దగ్గరెం తుందే? ఎంతున్నా అది నాకు, మధుబాలకు అడ్డం రాగలదా?

భయమల్లా ప్రీతి గురించే. 'డాడీ! ఇదేం పని?' అంటుందా? లేక నా అసంతృప్తిని అర్థం చేసుకుం టుందా? ఇష్టమున్నా లేకపోయినా తప్పదు. వాళ్లిద్దరికీ వేరే ఆధారమేముంది? నాతో కో-ఆపరేట్ చెయ్యా ల్సిందే. ఒక మొద్దురాచ్చిప్పతో జీవితాంతం ఏడుస్తూ గడపమని ఎక్కడన్నా రాసుందా? (మరిన్నేళ్లు సంసారం చెయ్యలేదా గాడిదా?) నిజమే, సావిత్రి నిజంగా పతి వ్రతే. నేనే దారిని వెళ్తే అటే వొచ్చింది. అన్నివిధాల సహ కరించింది. 'ఇట్లు మీ విధేయురాలు,' అంతే. అంత వరకు ఓకే, అయితే ఈ వొదులుతనం సంగతి? నా కోర్కెలు మాత్రం తీరొద్దా? జన్మంతా ఇట్లాగే వేస్ట్ కావాలా? (ఓల్డ్ స్టుపిడ్ కంట్!) సరే, మధుబాలతో వున్నా అది నా పర్సనల్ ఎఫైరే. సావిత్రికి మాత్రం అన్యాయం చేస్తానా? 'సావిత్రీ! నీ పతిభక్తికి కడుంగడు సంతసించితిని. ఏదేని వరంబు కోరుకొనుము. అదియును నీ పతి ప్రేమ దక్క!' ప్రీతికి బాగా చదువు చెప్పించి, మంచి సంబంధం చూసి చేద్దాం, దాందే ముంది? ఇక సమస్యే లేదు. (హరీయప్ చక్రపాణీ! పిట్టకోసం, పిల్లకోసం).

ఆ నగవు, ఆ బిగువు, ఆ నగవు బిగువులు, బిగువు నగవులు. మధుబాలే నాకు సరైన జోడీ. (అదియును ఆ ఒంటి బిగువు వున్నంతవరకేనా? హహ్హా!) ఎంత కష్టపడ్డాను తనతో క్లోజ్‌నెస్ కోసం? ఉద్యోగం ఇప్పించాను. తనలో నిర్లిప్తత పోగొట్టటానికి ఎన్నో సాయంకాలాలు గడిపాను. (శరీరమే వశం కాలేదు. కానివ్వలేదు. ఐ పిటీ యు చక్రపాణీ!) మాటల్లో కన్‌సర్న్ చూపించాను. చెస్‌లో మెప్పించాను. చాటుమాటు ఎత్తులు వేస్తూ, మెల్లమెల్లగా ఆమె (బలగాల)ను కబళించటం- ఓ మై కన్నింగ్‌నెస్, ఐ అప్రీషియేట్ దీ. ఇక మధుబాల నన్ను కాదనగలదా? 'మీరజాల గలదా నా ఆనతి, మధుబాలా సతి?' మరి ఆమె తండ్రి రామచంద్రరావ్? జానే దేవ్. డోంట్ వర్రీ.

అరె యార్, మూవ్ ఐసే! కదులు, కదులు. వదులు వదులు. యూ మస్ట్ లూజ్ ద లూస్‌నెస్.

**సతీ సావిత్రి: *నేనంటే నా ఒళ్లేనా?***

అంతా నా కర్మ. 'డాడీని పెళ్లాడి నువ్వేం పొంద గలిగావు?' అని ఇవాళ ప్రీతి అడిగితే జవాబు చెప్పలేక కళ్లమ్మట నీళ్లు తిరిగాయి. 'పోనీ, ఏం పోగొట్టు కున్నావు?' అనడిగినా జవాబు చెప్పలేను. చిన్నప్ప ట్నుంచి మాత్రం నాకేం ఆలోచన వుంది గనక? 'ఆడ పిల్ల ఒబ్బిడిగా వుండాలి'- ఇదే సూత్రం మా అమ్మ నేర్పింది. వానాకాలం చదువు. ఈడేరగానే పెళ్లి. పెళ్లప్పుడు గూడా నా ఇష్టం ఎవ్వరూ అడగలేదు. కట్న కానుకల గురించే ఎక్కువగా మల్లగుల్లాలు పడ్డారు. అదృష్టవశాత్తు మంచి మొగుడే దొరికాడని అన్నారంతా. నేనూ అంతే అనుకున్నాను. అందానికి అందం, ఉద్యో గానికి ఉద్యోగం వున్నాయి ఆయనకి. ఇంకేం కావాలి? నా బతుకు గాట్లో పడింది. ఇప్పుడు తిరిగి చూసుకుంటే ఈ పదిహేడేళ్లు ఎంత తొందరగా గడిచిపొయ్యాయా అని ఆశ్చర్యం! ఒకరోజు అమ్మాయే అడిగింది. 'అమ్మా! ఇన్నేళ్ల నీ సంసారజీవితాన్ని గళ్లుగళ్లుగా విడగొడితే అన్ని ట్లోనూ వంట, తిండి, అంట్లు, బట్టలు, ఊడుపులు, కడుగుళ్లు, పతిసేవ, కూతురు సేవ - ఈ మాటలు గాక ఇంకేమైనా ఉన్నాయా?' అని. దొంగముండ, తెలివైందే. నేనంటే ఎంత ప్రేమో. నా పోలికేనంటారు. కానీ బతుకు లో విడిగా నాకంటూ గళ్లేమున్నాయి? ఆయన నా వంట మెచ్చుకుంటే తృప్తి. కోరికతో ఒళ్లు తడిమితే తృప్తి. ప్రీతి నా చేతుల్లో పెరిగి పెద్దవుతుంటే తృప్తి. కానీ... మరి... ఇప్పుడెందుకీ కన్నీళ్లు?

నేనో మోస్తరు అందగత్తెనే అంటారంతా. నేనె ప్పుడూ అద్దంలో నా మొహం పరీక్షగా చూసుకోలేదు. ఆయన మొహమే నా అద్దం. ప్రేమగా నన్ను దగ్గరికి తీసుకుంటే నేనందంగా ఉన్నట్టే లెక్క. విసుక్కుంటే ఎక్కడో నాలోనే తప్పులున్నట్టు లెక్క. అయితే ఈ లెక్క ల్లోనే ఎక్కడో తప్పుందని ఈ మధ్యన పదేపదే అన్పి స్తుంది. కాలం గడిచేకొద్దీ మగాళ్లలో సలసలలాడే కోరిక తగ్గొచ్చుగానీ ఆపేక్ష పెరగొద్దా?

మాటమాటకీ విసుక్కోవాలా? కాఫీలో పంచ దార ఎప్పుడూ ఎక్కువ తక్కువ కాకుండా సమంగా

వుంటుందా? ఏడాదిలో ఒక్కసారైనా కూర మాడకుండా వంటచేసే ఆడదుంటుందా? ఈ విసుక్కి అవే కారణాలు కావని నా మట్టిబుర్ర కన్పిస్తుంది. నేనంటేనే ఆయనకి మొహం మొత్తింది. (పచ్చిగా చెప్పాలంటే) నా స్తనాలు జారిపొయ్యినయ్యంటారు. కీళ్లనొప్పుల్తో పగలంతా చాకిరీ చేసీ చేసీ, రాత్రికి ఒళ్లంతా పచ్చి పుండవుతుంది. నువ్వెందుకూ పనికిరావని కోప్పడతారు. పదిహేడేళ్ల నాడున్నట్టు ఇప్పుడెట్లా వుంటుంది శరీరం? అయినా నేనంటే నా ఒళ్లు మాత్రమేనా?

సేవలన్నీ నాచేత చేయించుకోని, ఇప్పుడు ఇంకె వరితోనో సంబంధం పెట్టుకుంటే నేనేం గావాలి? కూతురేం గావాలి? ఎవరో చెపితే ముందు నమ్మలేదు. అంత నమ్మకం ఆయనమీద. ఒకసారి ఆ వన్నెలాడి (మధుబాల) ఇంటికొచ్చింది. కుక్క కరిచిందంటే మరే ననుకున్నా. ప్రేమకుక్క కరిచిందన్నమాట. (ఏ మాట కామాటే. మనిషిని చిదిమి దీపం పెట్టొచ్చు.) మాటల్లో వెకిలితనమే లేదు. అయినా మన బంగారం మంచిదైతే ఆ నంగనాచినెందుకనుకోటం?

ఆ రోజు ఆయన్ని కదిలిస్తే 'నా మీద నమ్మకం లేదా' అన్నారు, కిటికీలోంచి బయటికి చూస్తూ. నా నోరు మూతబడింది. కానీ ఆ మాటలనేటప్పుడు తను నా కళ్లల్లోకిగాక బయటికెందుకు చూడాలి? రాను రాను ఆఫీసు నుంచి ఆలస్యంగా ఇంటికొస్తున్నారు. మెల్ల మెల్లగా అంతా అర్థమైపోయింది. ఇరుగు పొరుగు అమ్మలక్కలనుంచి రకరకాల మాటలు విన్పిస్తుంటే, ఇన్నాళ్లు ప్రాణంకంటే ఎక్కువగా నమ్మినమనిషి నన్నిట్లా చేశాడేమిటా అని దేవుడికి మొరపెట్టుకున్నా. తనకు పెద్ద జబ్బు చేసి నెలరోజులు మంచాన బడినప్పుడు నా సేవలు చూసి ఎంత మెచ్చుకున్నారు? 'వచ్చే జన్మకీ నువ్వే నా భార్యవి' అన్నారు. నా బతుకు ధన్యమైపో యిందనుకున్నా. మరి ఇప్పుడేమో ఈ జన్మకే మోసం వచ్చింది.

గట్టిగా నిలదీస్తే తెగబడతారేమో? పుటిక్కిన ఇంట్లోంచి పొమ్మంటే ఏం గతి? ఎట్లా బతికేది? అమ్మా నాన్నా ఎప్పుడో దాటిపొయ్యారు. నాకు ప్రీతి, ప్రీతికి నేను తప్ప ఎవరున్నారు? అదే నాకు ధైర్యం చెప్తుంది. పదిహే డేళ్లు రోగం, రొష్టూ అనకుండా ఇంటెడు చాకిరీ చేశా. ఇవాళ పెనిమిటి పొమ్మన్నప్పుడు బతికే దారి లేదంటే, ఈ మాయదారి సంసారాల్లో ఎక్కడో పెద్ద మోసమున్నట్టే లెక్క. అదుగో ఆయన పూలరంగళ్లా తయారై వెళు తున్నారు. ఇంకెక్కడికి? ఆ వగలమారి దగ్గరికే. ఈ గుండెల్లో కుంపటి ఇంకెన్నాళ్లు మొయ్యగలను? మమ్మల్నేం చెయ్యదల్చుకున్నారని అడగనా? వద్దా?

**మధుబాల: మంచుముక్క వేడిగా ఉంటుంది.**

జ్వాల వుంది. కాంక్ష వుంది. కానీ నన్ను మంచు ముక్కగానే గుర్తిస్తారందరూ. మంచు ముక్కకి భావోద్వే గాలుండవు, నిజమే. అయితే అది చల్లగా, చక్కగా పార దర్శకంగా ఉండదూ?

'ఫాల్స్ ఐడెంటిటీ' నన్నెప్పుడూ బాధిస్తుంది. మనిషిలో గుర్తించాల్సిన వాటిని గుర్తించకపోవటం, అక్కర్లేని వాటిని గుర్తించటం ఎంత విషాదం! 'నువ్వు చాలా అందంగా వుంటావు మధుబాలా!' నన్ను ప్రేమిం చిన మొదటి వ్యక్తి కాలేజీలో అన్నప్పుడు 'ఛా' అన్నాను వెటకారంగా. ఇంకొకడు నాకు ప్రేమలేఖలు రాసీ, రాసీ విసుగెత్తి, చివరికి, 'నువ్వు గోడవి,' అన్నాడు. నవ్వాను. 'ఒట్టి మంచుగడ్డవి,' అన్నాడింకా కసిగా. మళ్లీ నవ్వాను. చాలాసేపు నవ్వాక, చిత్రంగా కన్నీళ్లొచ్చాయి.

అద్భుతంగా పాడుకోగలను, నా ఆనందం కోసం. నాన్నవల్ల చిన్నప్పట్నుంచి చదరంగంలో ఆసక్తి కలిగింది. నేషనల్ 'బి' దాకా వెళ్లి, కొన్ని బహుమతులు కూడా తెచ్చుకున్నాను. పుస్తకాలు కంఠస్థంచేసి, ఫస్ట్ మార్కులు సంపాదించుకునే పిల్లలే తెలివైనవాళ్లుగా చలామణి కావటం నాకసహ్యం. అయితే నన్నెవరూ నా ఆసక్తు లతో గుర్తించలేదు. శరీరంతో గుర్తించారు. ఐ సింప్లీ హేటిట్. ఒక్కోసారి నగ్నంగా గులాబిరేకులాంటి నా శరీరం చూసుకున్నప్పుడు దిగులేసేది. చర్మంమీద నిగా రింపు తప్ప శరీరగానం ఎవరికీ తెలీదు. నా దురదృష్టం.

పసిపాప పాలచిగుళ్ల నుంచి తల్లి చనుమొన తప్పిపోయిన అనుభూతి ఎట్లా వుంటుందో నేను చెప్ప గలను. అమ్మ నా ఐదో ఏటనే పోయింది. తల్లి ఒడి నా కలల్లో తరచూ కన్పించే దృశ్యం. నన్ను లాలించే మనిషి కావాలి. మదర్ ఫిక్సేషన్. ఐ కాంట్ డూ ఎవే విత్ ఇట్. నేనంటే ఎంత ప్రేమ వున్నా నాకు 'అమ్మ' కాగలడా?

దాంపత్యం ఒక శారీరక, మానసిక జీవితావ సరం. అది కేవలం రెండు జననాంగాల రాపిడిగానో, అనేకులతో రహస్యసంబంధంగానో భావించేవాళ్లని మనసారా ద్వేషిస్తాను. నాక్కావల్సిన వ్యక్తి ఎవరో నేను కనుక్కునేలోపే, నాన్న తొందరతో, ఒక పిరికివాడితో నా పెళ్లయిపోయింది. ఆ రాత్రిని వెన్నెల దహించేవేళ- నేను పసిపిల్లనై, నగ్నమై, తన ఒడిలో అమృతస్పర్శ పొందా లనుకున్నాను. సీతాకోకచిలక గడ్డిపువ్వు మీద వాలటం

ఎంత అద్భుతం! 'నీ అందం చూస్తుంటే భయమేస్తుంది,' అన్నాడతను వెనక్కి తగ్గి. గాయం, ఎంతో లోతుగా.

నేనెప్పుడూ నా అందంతో ఇతరుల్ని ఆకర్షించాలని ప్రయత్నించలేదు. కాని అతనిలో ఎందువల్ల ఆ భావం కలిగిందో నాకు తెలీదు. ఈ తనువొక వీణ. అతనెప్పుడూ మీటలేకపోయాడు. నా అందం ఏ బలహీన క్షణంలో తనని మోసం చేస్తుందో అని జాగ్రత్త పడుతుండేవాడు. భయంతో కూడిన జాగ్రత్త. నేను పరవశంగా వికసించే సమయాన తను ముడుచుకుపొయ్యేవాడు. పట్టరాని నవ్వు నవ్వితే బెదురుగా చూసేవాడు. ఎవరైనా మగ స్నేహితుల్తో మాట్లాడితే ఆత్మన్యూనతతో బాధపడేవాడు. ట్రూ హజ్బెండ్. 'నేనంటే నీకు నిజంగా ఇష్టమేనా?' అని ఎన్నిసార్లు అడిగాడో?

రాను రాను అతను నా నవ్వుల్ని, వంపుసొంపుల్ని, దాపరికం లేనితనాన్ని భరించలేని స్థితికి చేరాడు. ఐ హాడ్ బికమ్ టూ మచ్ ఫర్ హిమ్. ఉన్నట్టుండి ఏడ్చేవాడు. సైకిక్. ఒకరోజు స్పష్టంగా చెప్పాను- 'నేను అందగత్తెను మైనస్ మోసగత్తెను.' తెల్లబోయి చూశాడు. కానీ అతనిలో సంకోచాలు పోలేదు. అత్తగారికి తొలినుంచీ నేనంటే అయిష్టమే. ఇంట్లో ఎవరికీ నా చెస్ ఆసక్తి నచ్చదు. క్రమక్రమంగా ఆ యింట్లో నిశ్శబ్దహింస పడ్డాను. ఏడాది కాపురంలో ఎన్నో యుద్ధాలు.

డబ్బంటే ఎంత యావ ఆ మనిషికి? ఒకరోజు తన అక్రమ సంపాదన- పదివేల నోట్లకట్ట చూపించి, గాఢంగా ముద్దు పెట్టుకున్నాడు. నన్నెప్పుడూ అట్లా ముద్దాడలేదు. అప్పుడడిగాను, 'ఒకవైపు లక్ష రూపాయలు, ఇంకోవైపు నేనూ వుంటే ఎవర్ని కౌగిలించుకుంటావు?' క్షణం సిగ్గుపడి, కుటిలంగా నవ్వుతూ 'అంత డబ్బు దొనకాలేగానీ...' అని సగంలో ఆగిపోయాడు. మిగతా సగం నాకు తెలుసు. దాంతో, 'ఇక చాలు' అనుకున్నాను. ఎనఫ్ ఈజ్ ఎనఫ్. ఆ మాట అతన్తో చెప్పినప్పుడు చిత్రంగా ఆ మొహంలో ఎంతో రిలీఫ్ కన్పించింది.

అమ్మ పోవటంతో కుంగిపోయిన నాన్న, నేను తిరిగొచ్చినందుకు సంతోషిస్తాడనుకున్నాను. కానీ నా కాపురం చెడిపోయినందుకు లోలోపల దుఃఖించాడు. నోరు విప్పి నన్ను మందలించలేదు. విడాకులు తెప్పించాడు. అయితే రాను రాను ఒక 'సొలిట్యూడ్'లోకి వెళ్లిపోయాడు, విస్కీ సాయంతో. చక్రపాణితో నా కొత్త పరిచయాన్నీ తప్పు పట్టలేదు.

శారీరకంగా, మానసికంగా గాయపడ్డ సమయంలో అతను నన్నోదార్చుతూ నా జీవితంలోకి ప్రవేశించాడు. పూలతోటలోకి చల్లగాలి, తూనీగలూ అట్లానే గదా ప్రవేశించేది? నాకు కె.వి.ఆర్. ఇంజనీరింగ్ కాలేజీలో ఉద్యోగం ఇప్పించాడు. నాక్కాస్త ధైర్యం వచ్చింది. తన వాక్చాతుర్యం, స్నేహం, చెస్- నా జీవితాసక్తి మేల్కొంది. క్షతగాత్ర గతం కనుమరుగైంది. గార్డెన్స్‌లో మా యింటికి తరచుగా వచ్చేవాడు. నాన్నకిష్టం లేదు. కానీ నాకోసం ఎవరో రావటం నాకెంతో యిష్టమే. ఒక్కోరోజు తన చేతుల్లో నాకిష్టమైన ఏ బెథోవెన్ సింఫనీ సీడీ వుండేది. లేదా సత్యజిత్ రాయ్ 'అపూర్ సంసార్.' క్లాసిక్స్ తప్ప మరేవీ నచ్చవు నాకు.

ఒక్కో సాయంత్రం గంటలు గంటలు చెస్‌లో మునిగిపొయ్యేవాళ్లం. ఆటలో ఆనందం ముఖ్యం నాకు. గుర్రం ఎత్తుల్లో, కొన్ని కాంబినేషన్స్‌లో ఎంతో అందం వుంది. అలెఖిన్, కాపబ్లాంకా మొదలైనవాళ్ల ఆటల్లో నాకెంతో సౌందర్యం కన్పిస్తుంది. చక్రపాణికి గెలుపు ముఖ్యం. నిగూఢమైన ఎత్తులు వేస్తాడు. విజయాన్ని ఆనందిస్తాడు. నేను, ఆటలో మా సాన్నిహిత్యాన్ని ఆనందించాను. నా అభిరుచుల్ని అభిమానించే మనిషి దొరికినందుకు సంతోషించాను.

ఒకరోజు ఇందిరానగర్‌లో వాళ్ల అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌కి తీసుకెళ్లి, తన భార్య, కూతుళ్లని పరిచయం చేశాడు చక్రపాణి. సావిత్రి బోళామనిషి, నేనక్కడున్న గంటన్నరలోనే తన సంసారజీవితంలో సగం చెప్పేసింది. ఇంటిపనంతా తనే చేస్తుంది. పనివాళ్లు గిట్టరు. సాయంత్రానికి ఒళ్లునొప్పులు, ఆర్థరైటిస్. మాటల మధ్య చిత్రంగా అంది, 'ముప్పయ్ మూడేళ్లకే ముసలిదాన్లా కన్పిస్తున్నాగదూ?' నిజమే. కానీ ఏం మాట్లాడగలను? ప్రీతి చురుకైన పిల్ల. ఉన్నట్టుండి, 'ఆంటీ! మా డాడీ మీలాంటి స్నేహితుల్ని ఇంటికి తీసుకురావడం ఇదే మొదలు,' అంది. తమ జీవితంలో రాగల మార్పును ముందే గుర్తించిందా?

మా యిద్దర్నీ సంగీత విభావరిలో ఎవరో చూసి, ఇంట్లో చెప్పినప్పుడు ఎంత గొడవైందో ఒకరోజు చక్రపాణి చెప్పాడు నవ్వుతూ. లోకులనే మాటలు చెప్పాడు. డిస్టర్బ్ అయ్యాను. అప్పటిదాకా మా స్నేహంలో ఇతరుల ప్రమేయం ఉంటుందని ఊహించలేకపోవటం నా పొరపాటే. అయినా అతన్ని రెసిస్ట్ చెయ్య

లేకపోయాను. నేను కోల్పోయిన లాలన అతనిదగ్గర దొరుకుతుందనే ఆశ.

'నాకు నువ్వు కావాలి. ఇంట్లో చెప్పేశాను. ఇక నాతో కలిసి వుండటమా, లేదా అనేది వాళ్లే నిర్ణయించుకోవాలి. రాత్రికే తిరుపతి ప్రయాణం. కాటేజ్ బుక్ చేశాను. దైవసాక్షిగా దండలు మార్చుకుని తిరిగొద్దాం... ఇంకే సమస్యా వుండదు,' అని ఒక సాయంత్రం వేగంగా చెప్పేసి వెళ్లిపొయ్యాడు. ఉక్కిరిబిక్కిరి. నా ఆలోచనతో నిమిత్తం లేకుండా అంతా తనే నిర్ణయించటం ఆశ్చర్యం కల్గించింది. అతనితో పెళ్లి అనే ఆలోచన ఇప్పటిదాకా రాలేదు. ఏదో థ్రిల్. జీవితం అందమైన మలుపు తిరగబోయే సమయం. నాన్నకి చెప్పి తన అభిప్రాయం అడిగాను. కాసేపు మౌనంగా ఉండి, 'ఒక సమస్య నుంచి ఇంకో సమస్యలోకి వెళ్తున్నావేమో తల్లీ!' అన్నాడు. బయటికి వెళ్లిపోయాడు నిశ్శబ్దంగా.

ఏం జరుగుతుందో, ఏం జరగాలో నేను తీరిగ్గా ఆలోచించుకునేలోపే ట్రైన్‌లో ఉన్నాను. పక్కన చక్రపాణి, ఏవేవో కబుర్లు చెబుతూ, మధ్య మధ్యలో 'ఐ లవ్ యూ,' అంటూ. ఉన్నట్టుండి 'దాన్నిక భరించలేను. వట్టి లూజ్ బాడీ,' అన్నాడు హేళనగా. ఆ మాటలకి నేను స్తంభించిపోయాను. ఇతనికీ శరీరమేనా ముఖ్యం! రైలు ప్రయాణం అంతసేపూ పరాకుగా ఉన్న నా ఒంటి మీద చనువు చూపించాడు. చీకటిలో నన్ను కౌగిలించుకున్నప్పుడు నా ఒళ్లు జలదరించలేదు. అతని తొందరకి చిరాకేసింది. అతనికి కృతజ్ఞురాలినే. ప్రేమికురాలిని కాగలనా? ఉత్కంఠ చల్లారి, ఆందోళనలోకి దిగిపోయాను. కాటేజీలో చక్రపాణి తొందరపడుతున్నాడు. నాలో ఏమైనా మార్పు గమనించాడేమో. 'స్నానం చేసి తొందరగా తయారవు. అలా బయటికి వెళ్దాం. ఈలోపు నేను వెళ్లి ఏర్పాట్లు చూసుకువస్తాను,' అని వెళ్లిపోయాడు. అతని గొంతులో వినపడీ వినపడని అధికారం.

స్నానం చేసేటప్పటికి తను కుర్చీలో కూర్చుని ఉన్నాడు. 'రేపు పొద్దున ముహూర్తం బాగుందన్నాడు. సో, ఈ సాయంత్రం ఫ్రీ. దేవిగారు దయ తలిస్తే సరదాగా అలా అలా తిరిగొద్దాం.'

అతని చూపులు నా కొత్త క్రేప్ చీరమీద, జాకెట్ మీద, దాని అంచున కాస్త ఉబికిన తెల్లటి పొంగుల మీద కదుల్తున్నాయి.

'చాలా మోహంగా ఉన్నావు,' అన్నాడు.

'మోహంగా' అని కాక 'మోహనంగా' అని వుంటే సంతోషించేదాన్ని. ఇద్దరం పాపనాశనంవైపు నడుచుకుంటూ వెళ్లాం. అటూ ఇటూ ఎత్తైన చెట్లు. ఎగుడు దిగుడు ప్రయాణం. నేనెక్కడికో లోతుల్లోకి వెళ్లిపోతున్న భావన. ఒకచోట ఆగి, రోడ్డు పక్కన చెట్లమధ్య ఎత్తైన రాళ్ల మీద కూర్చున్నాం. చక్రపాణి అటు తిరిగి, నా వీపు నానుకొని ఏవో కబుర్లు చెపుతున్నాడు. అవి నా మనస్సులోకి వెళ్లటం లేదు. మాటమాటకి నాన్నే గుర్తొస్తున్నాడు. కనుచీకటి పడుతోంది. "వెళ్దాం పద," అని ఒక్కసారిగా లేచాడు చక్రపాణి. తనని ఆనుకొని ఉన్న నేను వెనక్కి వాలిపోయాను. ఆపుకోలేక, పట్టు దొరక్క, నున్నటి రాయి మీదగా జారి, కింద మరో రాయిమీద పడ్డాను. కాలు మెలికపడింది. చేతులు గీసుకుపొయ్యాయి. నొప్పి. మంట. చక్రపాణి కంగారుపడ్డాడు. అతని చెయ్యి పట్టుకొని ఎలాగో కుంటుకుంటూ కాటేజీ చేరాను. కాలు బెణికింది. ఒకటే సలుపు. చక్రపాణి బయటికి వెళ్లి మాత్రలు తెచ్చాడు. నొప్పి కొంచెం తగ్గింది.

"మై గాడ్! అయామ్ లక్కీ. అదే మొహానికి తగిలి వుంటే నీ అందమంతా ఏమైపొయ్యేది? ఐ కాంట్ బేరిట్," అన్నాడు చక్రవర్తి. ఉలిక్కిపడ్డాను. దేన్ని గురించి బాధపడుతున్నాడతను? నా గురించి కాదా?

బయట తెరలు తెరలుగా మంచు. దూరంగా లీలగా కొండలు, లోయలు. రాత్రికి నిద్రపట్టలేదు. ఒంటి గంటకి అదాటున మెలకువొచ్చింది. కాలు నొప్పేనా? మనస్సులో ఇంకేదో నొప్పి. తెలీని దిగులు. కొద్ది సమయమే మిగిలి వుంది, నా తుది నిర్ణయానికి. ఇదే చదరంగంలోనయితే కాసేపట్లో పెద్ద నిర్ణయాలు తీసుకునేదాన్ని. అయినా ఇప్పుడు మాత్రమేం? ఈ సమయం చాలదా ఒక స్థిరనిర్ణయం తీసుకోవటానికి? కళ్లు మూసుకొని- బ్లైండ్ ఫోల్డ్ చెస్‌లో మాదిరిగా- మనసు లగ్నం చేశాను. ఆపైన ఇలాంటి వేరియేషన్స్, కాంబినేషన్స్, పెర్మ్యుటేషన్స్ కొట్టిన పిండే.

సమస్యకి మూడు కోణాలు. ఒకటి- చక్రపాణికి నామీద ఎందుకాసక్తి కలిగింది? ఆలోచించగా నా అందం కన్నా తొలి కారణం కన్పించలేదు. భార్య దగ్గర కన్నా నా దగ్గర ఎక్కువ శరీరతృప్తి లభిస్తుందనుకుని వుండొచ్చు. భార్యపట్ల అసంతృప్తిని అతనెప్పుడూ దాచుకోలేదు. అయితే నా ఆలోచనకి తగినంత వ్యవధి నివ్వకపోవటంలో ఏదో కపటం దాగి వుండాలి. (అతని గేమ్‌లోనూ అంతే.) ఇది కూడా చాలా నిగూఢమైన ఎత్తా? లేకపోతే యింట్లో స్పష్టంగా చెప్పకుండా, ఎవరికీ తెలీకుండా, దొంగతనంగా ఈ దండల మార్పిడేమిటి? మరీ ముఖ్యమైన ప్రశ్న- పదిహేడేళ్లు కలిసి వున్న భార్యని,

కూతుర్ని అంత తేలిగ్గా ఎట్లా వదులుకోగలుగుతున్నాడు? వదులుకోటానికి అతను చూపించే కారణాలు సరైనవేనా? అంత తేలిగ్గా వాళ్లని వదులుకొనేవాడు ఏదో ఒకరోజు నన్ను మాత్రం వదిలెయ్యడా? నేను పడ్డప్పుడు 'మై గాడ్!' అన్న అతని మాటలో ఎంత అర్థం వుంది! నా మొహానికే దెబ్బ తగిలివుంటే? అతని మోహం ఏమయ్యేది?

రెండో కోణం- సావిత్రి. నా కారణంగా తన బ్రతుకు అల్లకల్లోలం కావటం, ప్రీతి భవిష్యత్తు దెబ్బ తినటం తప్పదు. అందరూ కలిసి వుండటం సాధ్యం కాదు. సావిత్రి స్థానంలో నేనుంటే ఈ మార్పు సహించగలనా? అనే ప్రశ్నకి నా దగ్గర జవాబు లేదు. నా సుఖం కోసం మరొకరికి కష్టం కలిగిస్తున్నానా? ఒక కాపురం కోసం మరో కాపురం కూల్చటమేనేమో. అదే అయితే యిది నిజంగా 'డిస్కవర్డ్ చెక్.'

మూడోది- నేను. కొన్ని అభిరుచులు తప్ప జీవితాంతం కలిసి వుండటానికి తగినంతగా మా అభిప్రాయాలు కలిశాయా అన్నది తేలటం లేదు. అతనిలో నేను కోరుకునే లాలన లభిస్తుందా? అతనిలో లాలస తప్ప లాలన కన్పించటం లేదు. అతనికి సన్నిహితం కావటానికి నా ఒంటరితనం, అభద్రత కూడా కొంత కారణమే. కానీ ఒంటరితనం నాకేమీ కొత్త కాదు. అలా జీవించగలను.

పొద్దున్నే చక్రపాణి నిద్రలేచేపాటికి నా నిర్ణయం అతని కోసం ఎదురుచూస్తుంది. నా విముఖత అతనితో స్పష్టంగా చెప్పాను. చెప్పటం పూర్తయ్యేపాటికి అతని మొహం తీవ్రమైన ఆశాభంగంతో, కోపంతో జేవురించింది. జీవితంలో నేను కోల్పోయిన స్పర్శ ఎప్పటికీ పొందలేననే వేదన నా కళ్లల్లో నీటిపొరగా కమ్మింది. అతని చెయ్యి విడిపించుకుని, ఈ చివరి మాటలనుకుంటూ గది బయటికి నడిచాను.

'ఓ నా స్నేహితుడు కాని స్నేహితుడా! నీ భార్యే కాదు, నేనే కాదు, నువ్వు గూడా ఒకనాటికి వొదులవుతావు. దృఢంగా ఉండాల్సింది మనస్సే.'

పొగమంచు విడిపోయింది. దూరాన కొండలు నీరెండలో మెరుస్తున్నాయి.

*ఆంధ్రజ్యోతి ఆదివారం, 20 జూన్ 1999*